క్లుప్తంగా

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీతో పాటు అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ యాదగిరి హెచ్చరించారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు సోమవారం యూనివర్సిటీ యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం యాంటీ ర్యాగింగ్ పోస్టర్లను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులను శారీరక, మానసిక, లైంగిక, ఒత్తిడికి గురిచేస్తే చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారని తెలిపారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. తెయూ యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, వైస్ చైర్మన్‌గా రిజిస్ట్రార్ యాదగిరి, కన్వీనర్‌గా ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, సభ్యులుగా అధ్యాపకులు కె రవీందర్‌రెడ్డి, ఎంబీ భ్రమరాంబిక, జి బాలకిషన్, ఎ పున్నయ్య, గుల్ ఈ రానా, మహేందర్ ఐలేని, కె కిరణ్మయి, కిరణ్ రాథోడ్‌ను నియమించారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్లకు స్థానచలనం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, విజయలక్ష్మి స్థానచలనం పొందారు. సాయాగౌడ్ పరీక్షల నియంత్రణ విభాగం, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విజయలక్ష్మి సారంగపూర్ బీఈడీ కాలేజీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రార్ యాదగిరి ఆదేశాల మేరకు విజయలక్ష్మిని పరీక్షల నియంత్రణ విభాగానికి, సాయాగౌడ్‌ను ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు బదిలీ చేశారు. సోమవారం వీరు బాధ్యతలు చేపట్టారు.

కామర్స్‌లో కాత్యాకు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ విభాగంలో పరిశోధకురాలు వడ్డేపల్లి కాత్యా పీహెచ్‌డీ సాధించారు. తెయూ కామర్స్ డీన్ జి రాంబాబు పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ ఆన్ కస్టమర్ రిటెన్షన్ అండ్ సాటిస్‌ఫాక్షన్ ఇన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా– ఏ స్టడీ' అనే అంశంపై కాత్యా పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. సోమవారం తెయూలో నిర్వహించిన ఓపెన్ వైవావోస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రవికుమార్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తెయూ రిజిస్ట్రార్ యాదగిరి, డీన్ రాంబాబు, అధ్యాపకులు శ్రీనివాస్, శ్వేత, గంగాధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం



రాజు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చక్రధర్‌నగర్ తండాకు చెందిన బదావత్ రాజు అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్ సోమవారం తెలిపారు. రాజు చెవిటి, మూగవాడు. సైగలతోనే ఇతరుల భావాలను అర్థం చేసుకుంటాడు. అక్టోబర్ 30న ఇంట్లో నుంచి వెళ్లిన రాజు తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీడీ కార్మికులే కీలకం

- తమవైపు తిప్పుకునేందుకు అధికార పార్టీ ప్రణాళిక
- జిల్లాలో బీడీ కార్మికులు 2.75 లక్షలకు పైమాటే..
- జీవన భృతి అందుకుంటున్న కార్మికులు, టేకేదార్లు 98,837 మంది

మోర్తాడ్(బాల్కొండ) : జిల్లాలో వ్యవసాయం తర్వాత అత్యధికంగా మహిళలు ఆధారపడింది బీడీ పరిశ్రమపైనే. బీడీలు చుడుతూ జీవనం సాగిస్తున్న కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ఆసరా పథకం కింద జీవన భృతిని అందిస్తుండగా లబ్ధి పొందుతున్న కార్మికులను తమవైపు తిప్పుకునే పనిలో అధికార పార్టీ అభ్యర్థులు నిమగ్నమయ్యారు. ప్రతి నియోజకవర్గంలో 20వేల మందికి మించి బీడీ కార్మికులు జీవన భృతిని అందుకుంటుండటంతో వారి ఓట్లు గంపగుత్తగా తమ పార్టీకే వచ్చేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. బీడీ కార్మికులతో పాటు వారి కుటుంబ ఓట్లు రాబట్టుకుంటే గెలుపు నల్లేరు మీద నడకేనని రాజకీయ పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్దేశించే విషయంలో బీడీ కార్మికుల ఓట్లు కీలకం కావడంతో ప్రతి కార్మికురాలిని అధికార పార్టీ నాయకులు స్వయంగా కలుసుకుని ఓట్లు రాబట్టుకునే పనిలో ఉన్నారు. జిల్లాలో బీడీ పరిశ్రమను నమ్ముకుని దాదాపు 2.75లక్షల మంది కార్మికులు ఉన్నారు. వీరిలో బీడీలు చుట్టేవారు ఎక్కువ మంది ఉంటే బీడీ కంపెనీల్లో పని చేసే మగవారు తక్కువ మంది ఉన్నారు. జీవనభృతి మాత్రం బీడీలు చేసేవారికి, టేకేదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ప్యాకర్లు, బట్టీ కార్మికులకు గతంలో ఇచ్చినా మళ్లీ రద్దు చేశారు.



జీవనభృతి అందుకుంటున్న బీడీ కార్మికులు

ఆర్మూర్ నియోజకవర్గం	21,637
బాల్కొండ	28,044
నిజామాబాద్ రూరల్	26,421
బోధన్	10,768
నిజామాబాద్ అర్బన్	7,031
బాన్సువాడ	4,322
టేకేదార్లు	614
మొత్తం	98,837

భృతి పొందని వారు వేలల్లో..

బీడీ భృతి పొందని కార్మికుల సంఖ్య ప్రతి నియోజకవర్గంలో 15 వేలకు మించి ఉంది. పీఎఫ్‌కు కటాఫ్ తేదీ ఎత్తివేసిన తర్వాత కొత్త పింఛన్ల మంజూరు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో అనేక మంది బీడీ కార్మికులకు జీవన భృతి అందడం లేదు. ఇప్పుడు జీవన భృతికి నోచుకోని వారికి ఎన్నికల తర్వాత ఎలాగైనా మంజూరు చేయిస్తామని అధికార పార్టీ నాయకులు హామీ ఇస్తున్నారు. బీడీ కార్మికుల ఓట్లను ఏకపక్షంగా రాబట్టుకుంటే తమ గెలుపు సులభం అని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా జీవన భృతికి నోచుకోని కార్మికులను ప్రసన్నం చేసుకుంటే తమకే ఆ ఓట్లు పడతాయని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆశిస్తున్నారు. ఏదేమైనా అభ్యర్థుల గెలుపు ఓటములను బీడీ కార్మికులు ప్రభావితం చేసే స్థాయికి ఎదగడం ఎలాంటి మార్పుకు అవకాశం ఇస్తుందో వేచి చూడాల్సి ఉంది.

నిరుద్యోగుల తరఫున నామినేషన్లు



కామారెడ్డిలో మాట్లాడుతున్న టీయూపీఈటీఏ ప్రతినిధులు

కామారెడ్డి క్రైం: తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల వివక్ష చూపించిందని టీయూపీఈటీఏ రాష్ట్ర అధ్యక్షుడు మాదగోని సైదులుగౌడ్ ఆరోపించారు. అందుకే నిరుద్యోగులు, ప్రైవేటు పీఈటీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలలో నామినేషన్లు వేస్తామన్నారు. సోమవారం కామారెడ్డిలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ తరఫున కామారెడ్డిలో భార్గవి నామినేషన్ వేశారని తెలిపారు.

రాష్ట్రంలో ఉద్యోగాలు నోటిఫికేషన్లు లేవని, నోటిఫికేషన్ వస్తే కోర్టు కేసులతో తాత్సారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో 616 గురుకుల పీఈటీ ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇచ్చి పరీక్షలు పెట్టారని, నియామకాలు చేపట్టకుండా కోర్టు కేసులను సాకుగా చూపిస్తూ అభ్యర్థులను ప్రభుత్వం దగా చేసిందన్నారు. గతంలో ఎన్నోసార్లు టీఎస్‌పీఎస్సీ, అసెంబ్లీ, ప్రగతిభవన్‌లను ముట్టడించామన్నారు. అయినప్పటికీ ఏవరూ స్పందించడం లేదన్నారు. అందుకే నామినేషన్లు వేస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మదన్‌మోహన్ రావు

గాంధారి/ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రచారానికి సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా గాంధారి మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎల్లారెడ్డి మండలంలోని మల్కాపూర్, వెల్లుట్ల, వెంకటాపూర్ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన, కార్యకర్తలను కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



నిజామాబాద్‌నాగారం: సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి రూరల్ గేమ్స్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. అండర్–14, 19 విభాగంలో ఖోఖో, కబడ్డీలో జిల్లా బాలుర జట్టు ప్రథమస్థానం, అండర్–14 బాలికల విభాగంలో కబడ్డీ జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. క్రీడాకారులను రూరల్ గేమ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్బాగోని అశోక్‌గౌడ్, భాస్కర్, బుస్స మహేష్, దత్తు అభినందించారు. ఈ జట్టుకు కోచ్‌లుగా చందు, రంజిత్, మేనేజర్‌గా పుష్పలత వ్యవహరించారు.

డెంగీ సోకకుండా అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ప్రోగ్రాం అధికారి రాజు



బతుకమ్మ కుంటలో సర్వే చేస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్: పట్టణంలో డెంగీ వ్యాధి సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి రాజు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. చిన్నారులకు జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించాలని సూచన చేశారు. ఎప్పటికప్పుడు ఏఎన్‌ఎంల సహకారంతో స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. వైద్య శాఖ అధికారులు చలపతి, తదితరులున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో గోదావరి పుష్కర ఘాట్ వద్ద సోమవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. పుష్కర ఘాట్ వద్ద 35 నుంచి 40 ఏళ్ల మహిళ మృతదేహం ఉందని సమాచారం అందడంతో వెళ్లి వెలికి తీశామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



రుక్కవ్వ మృతదేహం

బాన్సువాడ రూరల్: బాన్సువాడ బస్టాండ్‌లో సోమవారం మధ్యాహ్నం బస్సు ఢీకొని రాజబోయిన రుక్కవ్వ(80) మృతి చెందింది. బాన్సువాడలోని ఆబ్కారి కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేసే రుక్కవ్వ రోజులాగే బస్టాండ్ ప్రాంగణం నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా అటువైపు వేగంగా వచ్చిన బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన రుక్కవ్వను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

మోపాల్: మండలంలోని కాల్పోల్‌కు చెందిన శైలజ (38) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వివరాలు.. శైలజ, తన కొడుకుతో కలిసి మూడ్రోజుల క్రితం బైక్‌పై నిజామాబాద్‌కు వెళ్తుండగా రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్ప వద్ద అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో శైలజ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం శైలజ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. రోడ్లపై వడ్లు ఆరబెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాల్కొండకు చెందిన ఒకరు..

బాల్కొండ: బాల్కొండకు చెందిన సుముకం దశరథ్(45) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతు సోమవారం మృతి చెందాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాలు.. దశరథ్ శనివారం రాత్రి స్కూటీపై ఆర్మూర్ వైపు వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి పడిపోయాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

నవీపేట: మండలంలోని పోతంగల్ శివారులో రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బుద్దా వెంకటసుబ్బారెడ్డి(52) సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. వివరాలు.. వెంకటసుబ్బారెడ్డి తన అత్తగారి ఊరైన మండలంలోని కమలాపూర్‌కు వచ్చాడు. పోతంగల్ వైపు నడుచుకుంటూ వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టపోవడంతో కొన్ని రోజులుగా మనో వేదనకు గురవుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

రెంజల్: మండలంలోని కందకుర్తిలో సోమవారం టిప్పర్ ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా రత్నేల్లి గ్రామానికి చెందిన దంపతులు ఇద్దరు పిల్లలతో రెంజల్ మండలం దూపల్లిలోని బంధువుల ఇంటికి వస్తున్నారు. కందకుర్తి వద్ద వీరి బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో మహిళకు, ఆమె కుమారుడికి గాయాలయ్యాయి. స్థానికులు టిప్పర్ డ్రైవర్‌ను పట్టుకుని చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు టిప్పర్‌ను డ్రైవర్‌తో పాటు స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం



మద్నూర్‌లో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న బీజేపీ అభ్యర్థి అరుణతార, బీజేపీ నేత డీకే అరుణ

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. సోమవారం బాన్సువాడలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి భుజంగరావు తెలిపారు. కాంగ్రెస్ నేతలు కాసుల బాలరాజ్, కాసుల రోహిత్, స్వతంత్ర్య అభ్యర్థి పట్ల భాస్కర్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి తరపున కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో బీజేపీ కౌన్సిలర్లు శ్రీకాంత్, నరేందర్, శ్రీనివాస్‌లు నామినేషన్ దాఖలు చేశారు. మద్నూర్ తహసీల్ కార్యాలయంలో బీజేపీ అభ్యర్థి అరుణతార ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆమె బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణతో కలిసి వచ్చి రిటర్నింగ్ అధికారి మనుచౌదరికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానానికి తొలి నామినేషన్ సోమవారం దాఖలైంది. గాంధారి మండలం మాతుసంగం గ్రామానికి చెందిన మ్యాదరి సంజీవ్ స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ప్రభాకర్‌కు నామినేషన్ పత్రాలను అందించారు. అలాగే జుక్కల్ అసెంబ్లీ స్థానానికి మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం ఈ నెల 9న నామినేషన్ వేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.



కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ కౌన్సిలర్లు



ఎల్లారెడ్డిలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న సంజీవ్

ప్రతిపక్షాలకు అభ్యర్థులు దొరకడం లేదు

- జుక్కల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



రాంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధే

పిట్లం(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలకు అభ్యర్థులు దొరకడం లేదని, బీజేపీ పార్టీ వారు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారిని, కాంగ్రెస్ వారు సంగారెడ్డి జిల్లాకు చెందిన వారిని జుక్కల్ నియోజకవర్గంలో పోటీ చేయించాలని చూస్తున్నారని జుక్కల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. ఆయన సోమవారం బొల్లక్‌పల్లి, మద్దెలచెరువు, బండపల్లి, గౌరారం తండా, కోమటిచెరువుతండా, గౌరారం, రాంపూర్, కుర్తి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధి పనులను చాలా చేసుకున్నాం.. ఇంకా కొన్ని మిగిలి ఉన్నాయి.. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే మిగతావి కూడా పూర్తి చేస్తానని అన్నారు. నియోజకవర్గంలోని దళితులందరికీ దళిత బంధు పథకం వచ్చేలా చూస్తానని పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాంపూర్‌లో పలువురు ఎమ్మెల్యే హన్మంత్ షిండే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, ఎంపీపీ కవిత, మండల రైతు సమితి అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వేదం చిందించే వారికే రైతుబంధు ఇవ్వాలి

రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి



కామారెడ్డి డిగ్రీ కాలేజీ మైదానంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

సాక్షి, కామారెడ్డి: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలమైందని రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. సోమవారం ఉదయం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో వాకర్స్‌తో ఆయన మాట్లాడారు. మట్టిని నమ్ముకుని, ఆరుగాలం స్వేదం చిందించే రైతులకు రైతుబంధు ఇవ్వాల్సిందిపోయి, సినిమా హీరోలు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఇస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా సంపాదించిన డబ్బులతో వందల ఎకరాలు కొనుగోలు చేసిన బడాబాబులకు రైతుబంధు వస్తోందని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యారంగం బాగుపడుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తే ప్రభుత్వం మన ఊరు మన బడి ప్రోగ్రాం ప్రకటించిందని, గత బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. తాము ఏ పార్టీకి వ్యతిరేకం కాదని, ఏ పార్టీనీ సమర్థించడం లేదన్నారు. అయితే తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. 35 లక్షల మంది నిరుద్యోగులు సఫర్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేదని, స్విస్ బ్యాంకుల్లో అక్రమ సొమ్మును తెప్పిస్తానని మాట తప్పిందన్నారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

- 3.2 కిలోల గంజాయి పట్టివేత



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

బాన్సువాడ: బాన్సువాడ ఎక్సైజ్ పరిధిలో నలుగురి నుంచి సోమవారం 3 కిలోల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ యాదగిరిరెడ్డి తెలిపారు. బాన్సువాడకు చెందిన వెంకటేష్, పిట్లంకు చెందిన రాజు బాన్సువాడ ఫిష్ మార్కెట్ వద్ద గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో అక్కడి వెళ్లి వారిని పట్టుకున్నామని చెప్పారు. వారి వద్ద ఉన్న 300 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని విచారించగా మెదక్ జిల్లా మారెడ్‌కు చెందిన బాలప్ప వద్ద గంజాయి కొనుగోలు చేశామని చెప్పారని తెలిపారు. దీంతో మారెడ్ గ్రామానికి వెళ్లి బాలప్పను అదుపులోకి తీసుకొని, 200 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు చెప్పారు. బాలప్పను విచారించగా పిట్లంకు చెందిన ఇబ్రహీం వద్ద గంజాయి కొనుగోలు చేస్తానని చెప్పడంతో ఇబ్రహీంను అదుపులోకి తీసుకుని 2 కిలోల 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు.రాజు,వెంకటేష్, బాలప్ప, ఇబ్రహీంలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై తేజస్విని, సిబ్బంది ఉన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం



భిక్కనూరు చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

భిక్కనూరు: భిక్కనూరు సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న చెక్‌పోస్టు వద్ద సోమవారం రెండు వాహనాలన నుంచి డబ్బులను స్వాధీనం చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మెదక్ పట్టణానికి చెందిన హుస్సేన్ వాహనం నుంచి రూ.2.10 లక్షలు, సికింద్రాబాద్‌కు చెందిన దేవానందరెడ్డి నుంచి రూ.71వేలు స్వాధీనం చేసుకుని టాస్క్‌ఫోర్సు సిబ్బందికి అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

మోపాల్‌లో..

మోపాల్: మోపాల్ చౌరస్తాలో అదేగ్రామానికి చెందిన షేక్ సలీం నుంచి రూ.2,16,730 నగదును పట్టుకున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. నగదుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి ట్రెజరీ కార్యాలయంలో జమ చేసినట్లు పేర్కొన్నారు.

బైక్ చోరీ

బాన్సువాడ రూరల్: మండలంలోని దేశాయిపేట్‌కు చెందిన బేపారి సాయికుమార్ బైక్ చోరీకి గురైంది. బాన్సువాడలోని జ్యోతిక రెస్టారెంట్ ఎదుట నిలిపిన బైక్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు సోమవారం ఫిర్యాదు చేశాడని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి రెస్టారెంట్ వద్ద బైక్ నిలిపి ఫుడ్ పార్సిల్ తీసుకుని వచ్చి చూసే సరికి ద్విచక్ర వాహనం మాయమైందన్నారు.



కేసీఆరే మూడోసారి సీఎం

కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని బీఆర్ఎస్ జుక్కల్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 11లో ▸



చరమగీతం పాడాలి

రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ కామారెడ్డి అభ్యర్థి వెంకటరమణారెడ్డి ప్రజలను కోరారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0 /17.3

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు డీకే అరుణ రాక



మద్నూర్: జుక్కల్ బీజేపీ అభ్యర్థి అరుణతార సోమవారం నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ రానున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. అరుణతార మద్నూర్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఉదయం 11 గంటలకు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- బీజేపీ అభ్యర్థి అరుణతార



మద్నూర్: తనకు అవకాశం ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ జుక్కల్ అభ్యర్థి అరుణతార అన్నారు. డోంగ్లీ మండలం మారెపల్లి, మల్లాపూర్, దోతి, ఎన్బురలో ఆదివారం ఆమె ప్రచారం చేశారు. కమలం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు బీజేపీకే అండగా ఉంటారన్నారు. తెలంగాణలో బీజేపీ చరిత్ర సృష్టించడం ఖాయమన్నారు. ఎన్నికల వాగ్దానాలను కేసీఆర్ తుంగలో తొక్కారని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలు తనను దీవించి ఒక్క అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



కామారెడ్డి క్రైం: డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి పట్టణ డ్రైవర్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇక్కడ నుంచి కేసీఆర్ పోటీ చేయడం మనందరి అదృష్టమన్నారు. సీఎం రాకతో కామారెడ్డి మరింత అభివృద్ధిలో దూసుకుపోనుందన్నారు. సీఎం కేసీఆర్‌ను కామారెడ్డి నుంచి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని డ్రైవర్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మంత్రి వాహనం తనిఖీ



వేల్పూర్ : మంత్రి ప్రశాంత్‌రెడ్డి వాహనాన్ని ఆదివారం వేల్పూర్ మండలం జాన్కంపేట్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. మండలంలోని పచ్చలనడ్కుడ, కొత్తపల్లి, వాడి గ్రామాల ఎన్నికల ప్రచారానికి వెల్తున్న మంత్రి వాహనాన్ని వాహనాల తనిఖీలో భాగంగా కాన్వాయ్‌లోని వాహనాలన్నింటిని తనిఖీ చేశారు.

అవినీతి పాలకులను ఓడించాలి

- మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి



ఖలీల్‌వాడి : అవినీతి నియంతృత్వ కేసీఆర్ పాలనను, అలాగే మోదీ సర్కారును ఓడించాలని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక కన్వీనర్, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రానికి జాగో తెలంగాణ బస్సుయాత్ర చేరుకున్న సందర్భంగా ఆయన పాలిటెక్నిక్ గ్రౌండ్లో మార్నింగ్ వాక్ చేస్తున్న నగరవాసులతో గ్రూప్ మీటింగ్ ఏర్పాటు చేశారు. అనంతరం నెహ్రూ పార్క్ చౌరస్తా, రైల్వేస్టేషన్ ఎదుట గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి, హెచ్‌సీయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆశలను కేసీఆర్ ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. కేంద్రం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు అనే భారీ ఎజెండాను ప్రకటించి మొండి చేయి చూపిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయకర్త గోవర్దన్ సీపీఐ (ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి ప్రభాకర్ తదితరులున్నారు.

రంగుమారుతున్న రాజకీయం

రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉండే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రధాన పార్టీలు వలసలను ప్రోత్సహిస్తుండడంతో నేతలు కండువాలు మార్చేస్తున్నారు. ప్రధాన నేతలు పార్టీలు మారుతుండడంతో ఎన్నికల పోరు రసవత్తరంగా మారుతోంది.

- కండువాలు మారుస్తున్న నేతలు
- బీజేపీ గూటికి వడ్డెపల్లి, కాంగ్రెస్‌లోకి ఏనుగు..
- బీఆర్ఎస్‌ను వీడిన లింగంపేట జెడ్పీటీసీ
- నేతల వెంటే అనుచరులు..
- రసవత్తరంగా ఎల్లారెడ్డి పోరు



సాక్షి, కామారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నాయకులు ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పార్టీ నుంచి ఆ పార్టీలోకి, ఆ పార్టీ నుంచి ఇంకో పార్టీలోకి మారుతున్నారు. ఆయా పార్టీలు చేరికల మీద దృష్టి సారించడంతో వలసలు జోరుగా సాగుతున్నాయి.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నేతలు...

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు వలసలపై దృష్టి సారించారు. ప్రధానంగా ఆయన బీఆర్ఎస్ మండలస్థాయి ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలను పార్టీలో చేర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ ప్రయత్నాలు ఫలించడంతో లింగంపేట జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఆమె భర్త సంతోష్‌రెడ్డితో పాటు ఇద్దరు ముగ్గురు సర్పంచ్‌లు ఆదివారం మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. నాలుగేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి జెడ్పీటీసీగా గెలిచిన శ్రీలత.. తర్వాతి కాలంలో బీఆర్ఎస్‌లో చేరారు. నిన్నమొన్నటిదాకా ఆ పార్టీలో కొనసాగిన శ్రీలత దంపతులు ఎన్నికల సమయంలో తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. పలు మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు సైతం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అనుచరులూ మదన్‌మోహన్‌రావుకు మద్దతుగా నిలుస్తున్నారు.

కారెక్కిన కాంగ్రెస్ నేతలు...

స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ నియోజకవర్గంలో పలు మండలాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే బి.జనార్దన్ గౌడ్ మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. వివిధ మండలాలకు చెందిన పలువురు నాయకులూ బీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా లింగంపేట మండలానికి చెందిన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నల్లమడుగు షరీఫ్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పలు గ్రామాలకు చెందిన కుల సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు.

చేరికలపై బీజేపీ ఫోకస్...

కాంగ్రెస్ టికెట్టు కోసం తీవ్రంగా ప్రయత్నించిన వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి.. అవకాశం దక్కకపోవడంతో నిరాశ చెంది పార్టీకి రాజీనామా చేసి, బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ అభ్యర్థిగా ఎల్లారెడ్డిలో బరిలో ఉండే అవకాశాలున్నాయి. సుభాష్‌రెడ్డి అనుచరులు చాలామంది ఆయన వెంటే బీజేపీలో చేరారు. ఆయన సైతం చేరికలపై దృష్టి పెట్టారు. వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో పాటు కుల సంఘాలను సంప్రదిస్తూ పార్టీలోకి చేర్చుకుంటున్నారు. మొన్నటివరకు తనతో కాంగ్రెస్‌లో కొనసాగిన నేతలందరిని బీజేపీలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొందరు చేరారు. మరికొందరు ఊగిసలాటలో ఉన్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌లోకి జెడ్పీటీసీ..

లింగంపేట: లింగంపేట జెడ్పీటీసీ శ్రీలత బీఆర్ఎస్‌కు షాకిచ్చారు. ఆమె ఆదివారం మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ కార్యకర్తలు, నాయకులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయన లింగంపేట మండలాన్ని అభివృద్ధి చేయకపోవడంతో కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్ రావును ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు. శ్రీలతతోపాటు మోతె సర్పంచ్ రాంరెడ్డి, ఒంటర్‌పల్లి సర్పంచ్ బండి రాజయ్య, సురాయిపల్లి సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఎక్కపల్లి సర్పంచ్ సతీష్ గౌడ్, మాలోత్ తండా సర్పంచ్ సునీత, కోమట్‌పల్లి ఎంపీటీసీ కమ్మరి కల్యాణి, లింగంపల్లి ఎంపీటీసీ బాగవ్వ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.



మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న జెడ్పీటీసీ శ్రీలత

కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- కామారెడ్డి గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ సీఎం అయ్యాకే గౌడ కులస్తులకు అన్ని విధాలుగా మంచి జరిగిందన్నారు. గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం అయ్యాక గౌడ కులస్తుల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంప గోవర్దన్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టగోని గోపీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో మైనారిటీల అభివృద్ధి

కామారెడ్డి క్రైం: కేసీఆర్ హయాంలోనే మైనారిటీల అభివృద్ధి జరిగిందని డిప్యూటీ సీఎం, హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. కామారెడ్డిలోని శుభం కన్వెన్షన్‌లో ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మైనారిటీల ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. కేసీఆర్ మైనారిటీల కోసం గురుకులాలు నిర్మించారన్నారు. మంచి చేసే నాయకుడిని వదులుకోవద్దన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలోని మైనారిటీలు కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రేవంత్ రెడ్డికి ముస్లింలు అంటే పడదన్నారు. అతడు గతంలో ఆర్ఎస్ఎస్‌లో పని చేశాడన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిన వారిని మనం ఎన్నుకోవడం సరికాదన్నారు. సమావేశంలో ఎంపీ బీబీపాటిల్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కేసి.. హోర్డింగ్ ఎక్కేసి..

- తాగిన మైకంలో హోర్డింగ్ ఎక్కిన యువకుడు
- కిందికి దింపిన స్థానికులు, పోలీసులు

ఖలీల్‌వాడి : తాగిన మైకంలో హోర్డింగ్ ఎక్కిన యువకుడు అక్కడే నిద్రపోయిన ఘటన నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ వద్ద చోటు చేసుకుంది. నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతానికి చెందిన మేస్త్రీ పని చేసే రవీందర్ అలియాస్ రవి ఆదివారం మద్యం ఎక్కువ మోతాదులో తీసుకుని అక్కడే ఉన్న హోర్డింగ్ ఎక్కి నిద్రపోయాడు. హోర్డింగ్‌పై రవీందర్‌ను చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఘటనా స్థలానికి ట్రాఫిక్ పోలీసులు, మూడో టౌన్ పోలీసులు చేరుకున్నారు. వారి సూచన మేరకు స్థానికులు హోర్డింగ్ ఎక్కి రవీందర్‌ను కిందికి దింపారు.



కంఠేశ్వర్ ప్రాంతంలో హోర్డింగ్ ఎక్కి నిద్రపోయిన రవీందర్

'కమీషన్లు తీసుకోనని ప్రమాణం'

లింగంపేట/ఎల్లారెడ్డి రూరల్: ''ఎమ్మెల్యేగా గెలిపించండి. నిస్వార్థంగా సేవచేస్తా. ఎవరి దగ్గరా కమీషన్లు తీసుకోనని భార్యాపిల్లలపై ప్రమాణం చేస్తున్నా'' అని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం లింగంపేట మండలకేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక మెజారిటీతో గెలుపొందుతానని రాహుల్‌గాంధీకి మాట ఇచ్చి వచ్చానన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటానని, కష్టపడే వారికే పదవులు, పనులు అప్పగిస్తానని పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే సురేందర్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిపిస్తే డబ్బుకు అమ్ముడుపోయి ప్రజలకు మోసం చేశారన్నారు. ఇప్పటికే కమీషన్ల పేరుతో కోట్ల రూపాయలు సంపాదించారన్నారు. రూ. 80 కోట్ల చెక్ డ్యామ్‌ల కమీషన్లు తీసుకొని ఆంధ్ర కాంట్రాక్టర్లకు అప్పగించారని ఆరోపించారు. సొంత గ్రామాన్ని, మండలాన్ని అభివృద్ధి చేసుకోలేని వ్యక్తి అని విమర్శించారు. కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌మోహన్‌రావు

విధుల్లో మినహాయింపు లేదు

- 91 మందికి షోకాజ్ నోటీసులు, మెమోలు
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బందికి విధుల్లో ఎలాంటి మినహాయింపు లేదని కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో ఆదివారం నోడల్ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. అక్టోబర్ 28, 30 తేదీల్లో మొదటి విడతగా ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరు కాని వారికి షోకాజ్ నోటీసులు, మెమోలు జారీ చేశామని తెలిపారు. పోలింగ్ సజావుగా నిర్వహించడంలో పీవోలు, ఏపీవోల పాత్ర కీలకమని అన్నారు. విధులు కేటాయించిన వారికి ఏ కారణాల చేత కూడా మినహాయింపు ఉండదన్నారు. తప్పక విధులకు హాజరు కావాలని, లేని పక్షంలో ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి దశ శిక్షణకు హాజరు కానీ 91 మందికి ఈ నెల 8న ఉదయం ఆయా నియోజకవర్గ కేంద్రాలలో మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. వీరందరికీ ఉత్తర్వులు అందజేయడంతో పాటు, అదనపు పోలింగ్ అధికారులుగా నియమించిన 124 మంది ఐకేపీ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. నోడల్ అధికారులు రాజారామ్, సతీష్ యాదవ్ పాల్గొన్నారు.

కంట్రోల్ రూం సందర్శన

కలెక్టరేట్‌లోని మీడియా సర్టిఫికేషన్, మానిటరీ కమిటీ కంట్రోల్ రూంను కలెక్టర్ ఆదివారం సందర్శించారు. ఓటర్ హెల్ప్‌లైన్, సి విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల వివరాలు తెలుసుకున్నారు. సోషల్ మీడియాలో, టీవీ ఛానళ్లు, దినపత్రికల్లో వచ్చిన ప్రకటనల వివరాలపై ఆరా తీశారు. వచ్చిన ప్రకటనల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. అభ్యర్థులు అనుమతి లేకుండా ప్రకటనలు వేయరాదన్నారు.



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

అర్బన్‌లో ఐక్యతారాగం..

ఉమ్మడి జిల్లాలోని రెండు జిల్లా కేంద్రాలైన నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి శాసనసభ స్థానాల విషయంలో కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న వ్యూహం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కామారెడ్డి నుంచి రేవంత్ రెడ్డిని, నిజామాబాద్ అర్బన్ నుంచి షబ్బీర్ అలీని పోటీలో నిలపాలని కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తోంది.

- షబ్బీర్‌అలీ అభ్యర్థిత్వం నేపథ్యంలో సమావేశం
- రామాయంపేటలో షబ్బీర్ ఫాంహౌజ్‌లో ఆత్మీయ కలయిక
- 7న నిజామాబాద్‌లో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- 9న షబ్బీర్ నామినేషన్.. హాజరుకానున్న రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : గజ్వేల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కామారెడ్డిలోనూ పోటీకి సిద్ధం కావడంతో ఇందుకు ప్రతిగా కాంగ్రెస్ అధిష్టానం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ను బరిలోకి దించేందుకు నిర్ణయం తీసుకోవడంతో రాష్ట్రం చూపు ఇటువైపు మరలింది. దీంతో ఈ నెల 9న నామినేషన్ దాఖలుకు షబ్బీర్ రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో షబ్బీర్ ఈనెల 7న నిజామాబాద్ రానున్నారు. నగరంలోని బోర్గం నుంచి పులాంగ్, శివాజీనగర్ చౌరస్తా, పెద్ద బజార్ మీదుగా నెహ్రూ పార్క్ వరకు భారీ ర్యాలీ చేయనున్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్లాన్ చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్లనున్నారు.

300 మంది నాయకులతో..

నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేయనున్న నేపథ్యంలో షబ్బీర్ ఆదివారం సుమారు 300 మంది నాయకులతో రామాయంపేటలోని తన ఫాంహౌజ్‌లో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అర్బన్ నాయకులందరూ ఐక్యతను చాటారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు కేశ వేణు, టిక్కెట్టు కోసం గట్టి ప్రయత్నాలు చేసిన మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, కాటిపల్లి నగేష్‌రెడ్డి, ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, దయాకర్‌గౌడ్, నరాల రత్నాకర్, కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు కై లాష్ శ్రీనివాస్, నాయకులు భక్తవత్సలం, శంకర్‌రావు, మీసాల సుధాకర్, శరత్, అజ్జ ప్రకాష్, రామర్తి గోపి, విక్కీయాదవ్, వేణు రాజ్, గడుగు రోహిత్, మైనారిటీ నాయకులు తదితరులు భారీగా పాల్గొన్నారు.



రామాయంపేటలో నిర్వహించిన సమావేశంలో సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న షబ్బీర్ అలీ

భారీ ఎత్తున ఏర్పాట్లు..

షబ్బీర్ తరుపున నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు సోమవారం ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నెల 9వ తేదీన షబ్బీర్ అలీ 3 సెట్ల నామినేషన్లు దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. షబ్బీర్ నామినేషన్ కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. 10వ తేదీన నిజామాబాద్ అర్బన్ ఎన్నికల ఇన్‌చార్జీని పార్టీ నియమించనున్నట్లు నాయకులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ నెల 8న రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నెల 10న కామారెడ్డిలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.

కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి

- రూ.90కి చేరువలో ధర
- కూరగాయల ధరలూ పైపైకి..

కూరగాయలు	పది రోజుల క్రితం	ప్రస్తుతం
ఉల్లిగడ్డ	30	90
పాలకూర	40	80
వంకాయ	60	80
బీరకాయ	40	80
క్యాబేజీ	50	80
పచ్చిమిర్చి	40	60
టమాట	20	40

ఎల్లారెడ్డి రూరల్/రాజంపేట: ఉల్లిగడ్డ కోస్తే కళ్లలో నీరు రావాలి.. కానీ కొంటే వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు ఉల్లి ధర పెరుగుతోంది. పది రోజుల క్రితం రూ.30కి కిలో ఉన్న ఉల్లి ధర ప్రస్తుతం రూ.90కి చేరింది. జిల్లాలో ఉల్లి సాగు తగ్గడంతోనే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. జిల్లాకు మహారాష్ట్ర, ఔరంగబాద్ నుంచి ఉల్లి దిగుమతి అవుతున్నట్లు హోల్‌సెల్ వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడు వర్షపాత ఆశించిన మేర లేకపోడం.. రైతులు ఉల్లి కాకుండా ఇతర పంటలు వేయడంతో ఉల్లి కొరత ఏర్పడింది. రానున్న రోజుల్లో ఉల్లి ధర మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఇతర కూరగాయల ధరలు సైతం పెరుగుతున్నాయి. కిలో కూరగాయలు రూ.80కి చేరడంతో ఏమి కొనే పరిస్థితి లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ధరలు నియంత్రించాలని కోరుతున్నారు.



ధరలు పెరిగాయి



కూరగాయల ధరలు వారం రోజుల వ్యవధిలో రెట్టింపయ్యాయి. ఉల్లిగడ్డ వారం పది రోజుల క్రితం 30 రూపాయలుంటే ప్రస్తుతం 90 రూపాయలకు చేరింది. వీటితో పాటు మిగతా కూరగాయల ధరలు కూడా పెరిగాయి. – భూలీ, బొల్లారం

ఏం కొనేటట్టు లేదు



కూరగాయల ధరలతో పాటు పప్పుల ధరలు కూడా బాగా పెరిగినయి. ఏమి కొనేటట్టు లేదు.. ఏమి తినేటట్టు లేదు. కూరగాయలు, పప్పుల ధరలు తక్కువ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– శంకరయ్య, మౌలాన్‌ఖేడ్

క్లుప్తంగా

ముగిసిన టోర్నమెంట్



నిజామాబాద్‌నాగారం: నగరంలోని రాజారాం స్టేడియంలో మూడు రోజులుగా సయ్యద్‌ఖైసర్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహమ్మద్ ఇలియాస్ బాబార్ మెమోరియల్ ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికే టోర్నమెంట్ నిర్వహించిన్నట్లు టోర్నమెంట్ నిర్వాహకుడు సయ్యద్ ఖైసర్ తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

జాతీయస్థాయి తైక్వాండోలో 'క్యూరియస్'కు పతకాలు



నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి తైక్వాండోలో క్యూరియస్‌కు పతకాలు వచ్చాయి. ఈ నెల 4న మహారాష్ట్రలోని పూణేలో ఉన్న ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నేషనల్ స్కూల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో జిల్లాకు చెందిన క్యూరియస్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు అద్భుతమైన విజయాన్ని సాధించారు. క్యోరుగి, పూమ్‌సే విభాగంలో అమన్‌సింగ్, లక్షోబ్య, హర్ష్‌ప్రాంద్రేలు 3 బంగారు పతకాలు, మయాంక్ తేజ్, దేవర్ష్‌రెడ్డిలు 2 రజత పతకాలు, మనీష్ కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్, కోచ్ వినోద్‌నాయక్ మాట్లాడుతూ.. విజయం మన క్రీడాకారుల కృషికి, అంకితభావానికి నిదర్శనమని అన్నారు.


చెస్ విజేతలకు అభినందనలు



నిజామాబాద్‌నాగారం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–13 విభాగంలో బాలబాలికలకు చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం నగరంలోని సన్‌ఫ్లవర్‌హైస్కూల్‌లో కార్యదర్శి రమేశ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను పీజీ హెచ్‌ఎం గంగారాం, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సంగీతరావు బహుమతు అందజేసి అభినందించారు. విజేతలుగా నిలిచిన వారిలో ప్రిన్సుజోసెఫ్(ఎస్ఎఫ్ఎస్), సుజన్‌కుమార్(అభ్యాసస్కూల్), నాగజోస్నిక, రోషిణి(అభ్యాసస్కూల్) ఉన్నారు. కార్యక్రమంలో ఆర్బిటర్ బ్రహ్మానందం, గంగాధర్, పీఈటీ సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యావంతులకు పెద్దపీట..

- అసెంబ్లీలో అడుగు పెట్టిన వారిలో ఒక్కరు మినహా అందరూ ఉన్నత విద్యావంతులే
- ఓటమి పాలైన వారు సైతం విద్యాధిక్కులే..



మోర్తాడ్: బాల్కొండ అసెంబ్లీ స్థానానికి నిర్వహించిన ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారిలో ఒక్కరు మినహా అందరూ ఉన్నత విద్యావంతులే కావడంతో నియోజకవర్గ ప్రజలు విద్యావంతులకే పెద్దపీట వేసారని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. నియోజకవర్గానికి 1952లో తొలిసారి ఎన్నిక జరుగగా ఈ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన అనంతరెడ్డి అప్పట్లో హెచ్ఎల్‌సీ చదివారు. హెచ్ఎల్‌సీ(12వ తరగతి) ఉత్తీర్ణత చెందడం అప్పట్లో చాలా గొప్ప విషయం. అలాగే 1957 విజయం సాధించిన తుమ్మల రంగారెడ్డి హెచ్ఎల్‌సీ వరకు చదివి రాజకీయాల్లో ప్రవేశించారు. 1962, 1967, 1972, 1978 వరుసగా ఎమ్మెల్యేగా ఎంపికైన అర్గుల్ రాజారాం నిజాం కళాశాలలో బీఏ చదివారు. అప్పట్లో బీఏ చదవడం అంటే ఇప్పుడు పీహెచ్‌డీతో సమానమని పాతతరం వారు చెబుతున్నారు. అర్గుల్ రాజారాం మృతితో 1981లో నిర్వహించిన ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన సుశీలా బాయి మాత్రం సామాన్య గృహిణి. ఆమె ప్రాథమిక విద్యను మాత్రమే పూర్తి చేశారు. 1983, 1985 ఎన్నికల్లో గెలుపొందిన మధుసూదన్‌రెడ్డి సైతం హెచ్ఎస్‌సీ పూర్తి చేశారు. ఆయన ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ, హిందీ భాషల్లో ప్రావీణ్యం సంపాదించి తన వాక్చాతుర్యంతో అందరిని ఆకట్టుకున్నారని పలువురు పేర్కొన్నారు. 1989, 1994, 1999, 2004 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించిన సురేశ్‌రెడ్డి నిజాం కళాశాలలో ఎంఏ ఎకనామిక్స్ పూర్తి చేశారు. అమెరికాలో పర్యావరణ శాస్త్రంలో ఎంఎస్ చదవడానికి సిద్ధమవుతున్న సమయంలో ఎమ్మెల్యేగా ఎంపిక కావడంతో ఇక్కడే స్థిరపడిపోయారు. ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడడంతో పాటు సందర్భోచితంగా ప్రసంగాలు ఇస్తూ అందరి మన్నలను అందుకున్నారు. సురేశ్‌రెడ్డి వాక్చాతుర్యంతోనే ఆయనకు స్పీకర్ పదవి దక్కిందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. 2009 ఎన్నికల్లో పీఆర్‌పీ తరఫున విజయం సాధించిన ఈరవత్రి అనిల్ ప్రసిద్ధ సీబీఐటీ కళాశాలలో బీఈ పూర్తి చేశారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం సంపాదించి అక్కడ కొంత కాలం స్థిరపడి రాజకీయాల్లో చేరడానికి స్వదేశానికి వచ్చారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్నారు. అలాగే 2014, 2018 ఎన్నికల్లో విజయం సాధించిన ప్రశాంత్‌రెడ్డి బీఈ సివిల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రుడు.

ఎంఏ పట్టాలు అందుకున్న సురేందర్‌రెడ్డి..

ఎన్నికల్లో విజయం సాధించిన వారిలో ఉన్నత విద్యావంతులు ఉన్నట్లే ఓటమి పాలైన వారిలోనూ ఉన్నత విద్యను అభ్యసించిన వారు ఉండడం గమనార్హం. 1994లో ఓటమి పాలైన బద్దం నర్సారెడ్డి 1966లో బీఏ పూర్తి చేశారు. 2004లో సురేశ్‌రెడ్డి చేతిలో ఓటమి పాలైన వసంత్‌రెడ్డి హోమియో వైద్య డిగ్రీని పూర్తి చేశారు. 2009 ఎన్నికల్లో ఓటమిపాలైన శనిగరం శ్రీనివాస్‌రెడ్డి ఎంబీఏ పూర్తి చేశారు. ఆయన అప్పట్లో అమెరికాలో ఉన్నత ఉద్యోగాన్ని వదులుకుని ఎన్నికల్లో పోటీ చేయడానికి స్వదేశానికి వచ్చారు. ఓటమి పాలు కావడంతో మళ్లీ అమెరికా వెళ్లిపోయారు. 2009 ఎన్నికల్లో టీడీపీ, బీఆర్‌ఎస్‌ల ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమిపాలైన వేముల సురేందర్‌రెడ్డి కూడా ఎంఏ చేశారు. పలు సబ్జెక్టుల్లో ఎంఏ పట్టాలను అందుకున్న సురేందర్‌రెడ్డి ఎంతో ఉన్నత విద్యావంతుడు కావడం విశేషం. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలైన మల్లికార్జున్‌రెడ్డి వైద్య విద్యను పూర్తి చేశారు. ఆయన అపోలో ఆసుపత్రిలో కార్డియాలజీ డిపార్ట్‌మెంట్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. 2018లో ఓటమి పాలైన సునీల్ రెడ్డి బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివారు, ఈరవత్రి అనిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విషయం విదితమే. బీజేపీ అభ్యర్థి రుయ్యాడి రాజేశ్వర్ న్యాయవాది కావడం గమనార్హం. ఇలా ఎంతో మంది బాల్కొండ బరిలో పోటీ చేసి గెలిచిన, ఓటమిపాలైన వారిలో ఉన్నత విద్యావంతులు ఉండటం నియోజకవర్గ విశేషంగా చెప్పవచ్చు.

అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు



రాజంపేట: శేర్‌శంకర్ తండా శివారులోని అటవీ భూమి ఆక్రమించిన కేసులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో రమేశ్ తెలిపారు. ఎఫ్ఆర్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శేర్‌శంకర్ తండా గ్రామానికి చెందిన కాత్రోత్ గన్యా ట్రాక్టర్‌తో శనివారం అటవీ భూమిని అక్రమాలకు గురి చేయడంతో స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న తాము సిబ్బందితో కలిసి కాత్రోత్ గన్యాను, ట్రాక్టర్‌ను అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. అటవీ భూమి ఆక్రమించిన కేసులో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కామారెడ్డి ఆదేశానుసారం 14 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. అటవీ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిన్న బీజేపీ.. నేడు బీఆర్‌ఎస్



ఈ నెల 4న బీజేపీలో చేరుతున్న సర్పంచ్ జ్యోతీమోహన్

మాక్లూర్: మండలంలోని గుత్పతండా బీఆర్‌ఎస్ సర్పంచ్ జ్యోతీమోహన్ ఈ నెల 4న పైడి రాకేశ్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. బీఆర్‌ఎస్ తప్పుడు హామీలు నచ్చక పార్టీ మారినట్టు ప్రకటించారు. తిరిగి 24 గంటల లోపే ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కప్పదాట్లను చూసి మండల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.



ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న సర్పంచ్ జ్యోతీమోహన్

టీడీపీ కథ ముగిసినట్లే..!

- తెలంగాణలో పోటీకి అంగీకరించని పార్టీ అధినేత
- చివరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి రాజీనామాతో నిస్తేజం
- జిల్లాలోని పలు స్థానాల్లో పోటీకి ఆసక్తి చూపిన నాయకుల్లో నిరాశ

మోర్తాడ్: తెలంగాణ ఆవిర్భావానికి ముందు జిల్లాలో ఒక వెలుగు వెలిగిన టీడీపీ మారుతున్న రాజకీయ పరిణామాలతో కనుమరుగైపోతోంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో పోటీకి దూరంగా ఉండాలని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పదవికి రాజీనామ చేసి బీఆర్‌ఎస్‌లో చేరాలని నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. పార్టీ కీలక నేత రాజీనామా చేయడంతో టీడీపీ కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేయాలని కింది స్థాయి నాయకులు ఆశించారు.

బీజేపీ పొత్తుతో..

2014లో బీజేపీతో పొత్తుతో టీడీపీ అభ్యర్థులు జిల్లాలోని వివిధ స్థానాల్లో పోటీ చేశారు. కానీ ఎక్కడా టీడీపీ, బీజేపీ అభ్యర్థులు విజయం సాధించలేదు. 2009 ఎన్నికల్లో మాత్రం ఆర్మూర్, జుక్కల్, బాన్సువాడ, కామారెడ్డి స్థానాల్లో టీడీపీ పట్టు సాధించింది. 2014లో పార్టీ ప్రభావం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. 2018లో పోటీకి అభ్యర్థులు ఎవరూ ముందుకు రాకపోవడంతో టీడీపీ బరిలో నిలువలేదు. ఈ ఎన్నికల్లో ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ స్థానాల్లో పోటీకి ఇద్దరు నాయకులు ఆసక్తి చూపినా పోటీకి పార్టీ అధినేత చంద్రబాబు అంగీకరించకపోవడంతో మరోసారి గుర్తు కనిపించే అవకాశం లేకుండా పోయింది. ఎన్నికల్లో పోటీకి పార్టీ దూరం కావడంతో నాయకులు అంతా ఉత్సవ విగ్రహాలుగా ఉండిపోయారనే వాదన వినిపిస్తోంది. ఏది ఏమైనా తెలంగాణ ఏర్పడక ముందు భారీ విజయాలను నమోదు చేసుకున్న టీడీపీ కథ ఇక జిల్లాలో ముగిసినట్లే అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దర్శన్, చరణ్, రాజాగౌడ్, తిర్మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: జిల్లా కేంద్రంలోని గిరిరాజ్, డిచ్‌పల్లి, బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పలు సబ్జెక్టుల్లో బోధించేందుకు అర్హులైన అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టుకు, డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ, తెలుగు, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఇంగ్లిష్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్, కామర్స్, బోటనీ, కెమిస్ట్రీ, బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీ లకు 50 శాతం) కలిగి ఉన్నవారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. బోధనానుభవం కలిగిన అభ్యర్థులు సర్వీస్ సర్టిఫికెట్ జత చేయాలన్నారు. అర్హులైన అభ్యర్థులకు ఈనెల 8న గిరిరాజ్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి డెమో, ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను గిరిరాజ్ కళాశాలలో మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలన్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మృతుడి వయసు 55 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. మృతిచెందిన వ్యక్తి పసుపు రంగు టీషర్టు వేసుకుని ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే 8712659853 నంబర్‌ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ ఆదివారం తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ. 18,790 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ధాన్యం లారీ బోల్తా



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి శివారులో ధాన్యం లారీ ఆదివారం బోల్తాపడింది. భాగిర్తిపల్లి నుంచి భిక్కనూరు రైస్ మిల్లుకు ధాన్యం లోడ్‌తో వస్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. విషయం తెలుసుకున్న పెద్దమల్లారెడ్డి విండో చైర్మన్ రాజాగౌడ్ సిబ్బందితో వెళ్లి ప్రొక్లెయినర్ తెప్పించి ధాన్యాన్ని వేరే లారీలో రైస్‌మిల్లుకు పంపించే ఏర్పాట్లు చేశారు.

పిచ్చి కుక్క దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు

మద్నూర్: మండల కేంద్రంలో ఆదివారం పిచ్చికుక్క దాడి చేసిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన ఆరేళ్ల వయస్సు గల ఉదయ్, ఏడేళ్ల వయస్సున్న అరుణ్, మల్లికార్జున్‌పై పిచ్చి కుక్క ఆదివారం దాడి చేసింది. వీరి ముఖం, చేతులపై తీవ్రగాయాలయ్యాయి.

ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారులపై, నడుచుకుంటు వెళ్తున్న వృద్ధుడిపై దాడి చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పిచ్చి కుక్కలను తరిమివేయాలని అధికారులకు, సర్పంచ్, ఉప సర్పంచ్‌కు వినతిపత్రం అందిస్తే కొన్నింటిని మాత్రమే పట్టుకొన్నారని మిగిలిన వాటిని అలాగే వదిలేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పిచ్చికుక్కల నివారణకు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.





కుక్కల దాడిలో గాయపడిన అరుణ్, మల్లికార్జున్

వ్యసనాలకు బానిసై ఆత్మహత్య



వర్ని: మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన వడ్ల మురళి (21) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణ కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చెడు వ్యసనాలకు అలవాటు పడిన మురళి తరచూ డబ్బుల కోసం ఇంట్లో తల్లిని వేధించేవాడని, శనివారం రాత్రి డబ్బుల విషయమై కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడని చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రూ. లక్షన్నర స్వాధీనం

నవీపేట: మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తుండగా రూ. లక్షన్నర స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ రామకృష్ణ తెలిపారు. అనంతగిరి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారులో ఒకరి నుంచి రూ. లక్షన్నర నగదు స్వాధీనం చేసుకున్నామని ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి, ట్రెజరీకి అప్పగించినట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

నాగిరెడ్డిపేట: మండలంలోని చిన్నఆత్మకూర్‌లో ఓ వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లచ్చిగారి నర్సవ్వ(35) శనివారం రాత్రి ఇంటిపక్కన ఉండే కొంపల్లి యాదమ్మ, కొంపల్లి లక్ష్మి, లింగాల లక్ష్మితో గొడవ పడింది. ఈ విషయం నర్సవ్వ భర్త రాములు, ఆమె తమ్ముడు అలగనూరి నవీన్‌కు ఫోన్‌చేసి తెలిపింది. కానీ ఆదివారం ఉదయం నర్సవ్వ గ్రామశివారులోని విద్యుత్‌స్తంభానికి అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తమ్ముడు నవీన్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెక్‌పోస్టుల తనిఖీ

నవీపేట/ బోధన్‌రూరల్/ రెంజల్: బోధన్ మండలం ఖండ్‌గావ్, నవీపేట మండలం యంచ చెక్‌పోస్టులను ఎన్నికల పరిశీలకురాలు తన్యాసింగ్ ఆదివారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టుల్లోని రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. వాహనాల రాకపోకల వివరాలపై ఆరా తీశారు. మహారాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల దగ్గర ప్రత్యేక నిఘా సారించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, బోధన్ తహసీల్దార్ గంగాధర్, ఎస్సైలు యాదగిరిగౌడ్, నాగనాథ్ ఉన్నారు. రెంజల్ మండలంలోని కందకుర్తిలో ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఎన్నికల పరిశీలకురాలు తన్యాసింగ్ పరిశీలిచారు. రికార్డులను తనిఖీ చేసి పలు విషయాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదావరి నదిని సందర్శించారు. నదిలో నుంచి అక్రమంగా చొరబడకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ రాంచందర్, ఎస్సై ఉదయ్‌కుమార్ ఉన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో..

వర్ని: చందూర్, మోస్రాతోపాటు నిజామాబాద్ జిల్లా సరిహద్దులోని మల్లారం, పైడిమల్ ప్రాంతాల్లో నియోజకవర్గ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. వివిధ పార్టీల అభ్యర్థుల పర్యటనలు మండలాల్లో ఉండడంతో, ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని తనిఖీలు చేపట్టారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బషీరుద్దీన్, గంగాధర్ ఉన్నారు.



ఖండ్‌గావ్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న తన్యాసింగ్

రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో కవాతు

ఖలీల్‌వాడి: నగరంలోని మూడు, ఐదో టౌన్, రూరల్ పీఎస్ పరిధిలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం కవాతు నిర్వహించారు. స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా ఎన్నికల్లో ప్రజల కోసం ఉన్నామని, ప్రజలు నిర్భయంగా ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అడిషనల్ డీసీపీ, ఏసీపీ కిరణ్ కుమార్ అన్నారు. కవాతులో నార్త్ సీఐ సతీశ్, మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్, ఐదో టౌన్ ఎస్సై అప్పారావు, మాక్లూర్ ఎస్సై సుధీర్ రావు, రూరల్ ఎస్సై మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.